క్లుప్తంగా

అందుబాటులో 450 బస్తాల యూరియా

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె మండల రైతుల వ్యవసాయ అవసరాల కోసం 450 బస్తాల(20 మెట్రిక్ టన్నులు) యూరియా ప్రభుత్వం మంజూరు చేయగా, మంగళవారం మండలంలోని అగ్రహారం రైతు సేవా కేంద్రానికి చేరుకుందని వ్యవసాయ అధికారి మంజుల తెలిపారు. యూరియా అవసరమైన రైతులు పొరుగు మండలాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, స్థానికంగా అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు యూరియా పంపిణీ చేస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వ్యవసాయ పనులు సాగించాలన్నారు.

మత్తుకు దూరంగా ఉండండి

బి.కొత్తకోట : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్థానిక సీఐ కే.గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక విద్యార్థి హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదవుపై తప్ప ఇతరా విషయాలపై దృష్టి పెట్టకూడదన్నారు. మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. సరదా కోసమో, తాత్కాలిక సంతోషం కోసం మత్తు జోలికి వెళ్లొద్దని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, కరెస్పాండెంట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీబీ, ఐసీటీసీ కేంద్రాల తనిఖీ

తంబళ్లపల్లె : స్థానిక సీహెచ్‌సీలోని టీబీ, ఐసిటీసీ కేంద్రాలను మంగళవారం జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రమేష్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్‌లో టీబీ పరీక్షలు గురించి ల్యాబ్‌టెక్నీషియన్లను అడిగి తెలుసుకున్నారు. టీబీ ముక్తియాన్‌భారత్ కింద పరీక్షలు వేగవంతం చేయాలని సూచించారు. అనుమానిత కేసులను గుర్తించి పరీక్షలు చేయాలన్నారు. తంబళ్లపల్లె ఏరియా హైరిస్క్‌లో ఉందన్నారు. ఐసీటీసీ కేంద్రంలోని హెచ్ఐవీ పరీక్షలు, పాజిటివ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాజిటివ్ కేసులు ఏఆర్‌టి కేంద్రంలో రిజిస్టర్ చేయించాలన్నారు. క్రమం తప్పకుండా మందులు తీసుకునేలా చూడాలన్నారు. ఆయన వెంట వైదులు అమరసింహరాజు, ఐసీటీసీ కౌన్సిలర్ చంద్రమోహన్, ఎల్‌టీ బాలాజీ,టీబీ సిబ్బంది రామకృష్ణ, భూపతి ఉన్నారు.

బాహుదా వంక ఆక్రమణ తొలగింపు



ఆక్రమణను తొలగిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

మదనపల్లె రూరల్ : పట్టణ నడిబొడ్డున, ఆర్టీసీ బస్టాండు సమీపంలోని బాహుదా వంక స్థలం ఆక్రమణకు యత్నిస్తున్న వైనంపై సాక్షి కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ రెడ్డెమ్మ బాహుదా వంక ఆక్రమణను పరిశీలించారు. వంక స్థలంలో చదునుచేసి రాతి కూసాలు నాటి ఉండటాన్ని గమనించి, సిబ్బందితో వాటిని తొలగించారు. స్థలం అన్యాక్రాంతం కాకుండా బోర్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

రోప్ స్కిప్పింగ్‌లో ప్రతిభ

మదనపల్లె సిటీ : రాష్ట్ర స్థాయి రోప్‌స్కిప్పింగ్ పోటీల్లో స్థానిక నెహ్రూమున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.నంద్యాల జిల్లా డోన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు తేజేశ్వర్ డబుల్ అండర్‌లో రెండవ స్థానం, శిరీష్‌కుమార్ స్పీడ్ స్ప్రింట్‌లో మూడవ స్థానం దక్కించుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శీనప్ప, పీడీ లత, ఉపాధ్యాయులు వేణుగోపాల్, కుమార్, బాబు, పద్మజ, మధుమతి, లలితకుమారి,మాధవిలు అభినందించారు.

కేరీర్ అవకాశాలపై దృష్టి సారించాలి

మదనపల్లె సిటీ : విద్యార్థులు తమ కెరీర్ అవకాశాలపై దృష్టి సారించాలని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. మంగళవారం కాలేజీలో ఐబీఎం స్కిల్స్‌బిల్డ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ ఎడ్యునెట్ ఫౌండేషన్ రిసోర్సు పర్సన్లు అశ్వినికుమార్, నరేంద్రలు ఐబీఎం స్కిల్స్ బిల్డ్ ప్రాగామ్ గురించి వివరించారు. కంప్యూటర్ సైన్సు అభివృద్ధి చెందుతున్న రంగాల్లో జ్ఞానం, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాయుడు, డీన్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిమ్మనపల్లె : మండలంలోని ఎంపిక చేసిన ప్రాంతాలలో రెండు రోజులపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ నాగరాజ తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైన్ పనులు జరుగుతున్న కారణంగా, బుధ, గురు వారాలలో నిమ్మనపల్లె, వెంగంవారిపల్లె గ్రామపంచాయతీలలోని వివిధ గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడతాయన్నారు. త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయన్నారు.

గుర్రంకొండ : తరిగొండలో వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



పీలేరు : వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



కేవీపల్లె : గర్నిమిట్టలో వైఎస్సార్ విగ్రహం వద్ద చీరల పంపిణీ



పేదల గుండెచప్పుడు వైఎస్సార్

పేదల గుండెల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని మంగళవారం పండుగలా నిర్వహించారు. మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం, పీలేరు, కేవీపల్లె, కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ, కలకడ, తంబళ్లపల్లె, కురబలకోట, బి.కొత్తకోట, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం మండలాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు,అభిమానులు, కార్యకర్తలు, వైఎస్సార్ విగ్రహాలకు పూల మాలలు వేసి ఘన నివాళి అర్పించారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



మదనపల్లె : కౌన్సిల్ హాలులో వైఎస్సార్‌కు నివాళులు



కలకడ: పండ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కలకడలో వైఎస్సార్ విగ్రహంవద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు



వాల్మీకిపురంలో వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా పేదలకు అన్నదానం



కలికిరిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పెద్దతిప్పసముద్రంలో వైఎస్సార్ వర్ధంతి



పెద్దమండ్యంలో నివాళి అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



నిమ్మనపల్లెలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు



రామసముద్రంలో నివాళి అర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు



కురబలకోట: అంగళ్లు వద్ద వైఎస్సార్‌కు నాయకుల ఘన నివాళి



బి.కొత్తకోట: నాయనబావిలో వైఎస్సార్ విగ్రహానికి నాయకుల నివాళులు



ములకలచెరువులో నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

స్థానికులకు ఉచిత ప్రవేశం కల్పించాలి



టోల్‌గేట్ వద్ద స్థానిక వాహనదారుల నిరసన

ములకలచెరువు : మండలంలోని బురకాయలకోట టోల్ గేట్‌లో స్థానికంగా ఉన్న వారి వాహనాలకు ఉచితంగా ప్రవేశం కల్పించాలని వాహనదారులు మంగళవారం టోల్‌గేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బురకాయలకోట, వేపూరికోట, పెద్దపాళ్యం, ములకలచెరువు, బి.కొత్తకోట సరిహద్దు మండలం తుమ్మణంగుట్ట, కనికలతోపుకు చెందిన వాహనదారులు పాల్గొన్నారు. స్థానికులు టోల్‌గేట్ కోసం భూములు సైతం కోల్పోయామని వాపోయారు. స్థానికులకు ఉచితంగా వెళ్లే వెలుసుబాటు కల్పించాలి, లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వెంకన్న పవిత్రోత్సవాలకు అంకుర్పారణ



అంకుర్పారణలో వేదపండితులు

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో మంగళవారం టీటీడీ ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలకు శ్రీకారం చుట్టారు. సాయంత్రం అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టార్, రమేష్‌లు ఆగమశాస్త్ర ప్రకారం సంప్రదాయబద్ధంగా భగవత్ ఆరాధనతో అంకుర్పారణ చేశారు. బుధవారం యాగశాల, పవిత్రప్రతిష్ఠ, పూర్ణాహుతి, స్నపన తిరుమంజనం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈ గోపినాథ్, సిబ్బంది నగేష్, దుష్యంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ షెడ్ పనుల పరిశీలన

పెద్దమండ్యం : వాటర్‌షెడ్ ద్వారా చేపడుతున్న పనులు నాణ్యతగా ఉండాలని డ్వామా పీడీ వెంకటరత్నం అన్నారు. మండలంలోని సీ గొల్లపల్లె, గుర్రంవాండ్లపల్లె మైక్రో వాటర్‌షెడ్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. చేపట్టిన నీటగుంతలు, చెక్‌డ్యాంల పనుల నాణ్యతను ఆయన పరిశీలించారు. పనులు నాణ్యతగా ఉండాలని, మరింత వేగంగా పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. వర్షం నీటిని నిలువరిస్తే భూగర్భజలాలు పెంపొందుతాయని అన్నారు. పిడి వెంట ఏపిడి లక్ష్మీనరసయ్య, పివో రవీంద్రుడు, వాటర్‌షెడ్ చైర్మన్ శివయ్య, మాజీ సర్పంచ్ నాగార్జున, చంద్రారెడ్డి, రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

అర్హులు అందరికీ సంక్షేమ పథకాలు

– ఎంపీపీ శ్రీదేవి

కలకడ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఎంపీపీ శ్రీదేవి కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో బాలయ్యగారిపల్లె సర్పంచ్ విశ్వనాథ పేదలకు ఇంటిస్థలాలకు స్థలం కేటాయించాలని కోరారు. అలాగే కలకడ ఉర్దూ ఉన్నత పాఠశాల దారి సమస్యను పరిష్కరించాలన్నారు. బాలయ్యగారిపల్లె పంచాయతీలో మూడు పాఠశాలలకు విద్యుత్ సౌకర్యం లేదని ఫిర్యాదు చేశారు. విలేజ్ సర్వేయర్లు స్వమిత్ర సర్వేకు సహకరించడం లేదని పంచాయతీ కార్యదర్శులు ఫిర్యాదు చేశారు. రాజీవ్ నగర్ కాలనీ, ప్రభుత్వ ఆసుపత్రి వీధికి వీధిదీపాలకు ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని, అలాగే టమాటామార్కెట్‌కు విద్యుత్ సర్వీస్ అందించాలని జావాద్ కోరారు. రాయితీపై అందించే సౌర విద్యుత్ పథకం సద్వినియోగం సద్వినియోగంకోవాలని ఏఓ సూచించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు జల్లా కృష్ణకుమారి, ఉపాధ్యక్షులు ఈశ్వర్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యులు ముబారక్, క్రిష్ణారెడ్డి, సర్పంచ్‌లు జల్లా రాజగోపాల్‌రెడ్డి, వెంకట్రమణ అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఏడీఎంకు పదోన్నతి

మదనపల్లె సిటీ : స్థానిక ఆర్టీసీ–1 డిపో ఏడీఎం రేవతికి పదోన్నతి లభించింది. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి డిపో మేనేజర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెను డీఎం మూరే వెంకటరమణారెడ్డి,సిబ్బంది అభినందించారు.

సమష్టిగా పని చేయాలి:

ఆర్టీసీ సిబ్బంది సమష్టిగా పని చేయాలని డీఎం మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. డిపోలో మంగళవారం గేట్ మీటింగ్ నిర్వహించారు.ఆగస్టు నెలలో రీజియన్‌లో 565.76 లక్షలు అదాయం వచ్చిందన్నారు. డిపోలో ఆదాయం పెంచేందుకు పని చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, కంట్రోలర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ వేలం రూ.82వేలు



వినాయకుడి లడ్డూను వేలంలో దక్కించుకున్న శంకర్‌రెడ్డి

ములకలచెరువు : మండలంలోని బురకాయలకోట పంచాయతీ బలకవారిపల్లెలో మంగళవారం గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద లడ్డూ వేలం పాట నిర్వహించారు. అందులో 6 కేజీల లడ్డూను తూగు శంకర్‌రెడ్డి రూ. 82 వేలకు దక్కించుకున్నారు. అనంతరం మేళ తాళాలతో ఊరేగింపు నిర్వహించారు.